# ముద్దు

శ్రీమతి నా రాకకోసం గుమ్మం దగ్గరే తచ్చాడుతోంది... టైమ్ సుమారు పదిగంటలు కావస్తోంది. వెన్నెల పుచ్చపువ్వులా విరబూసింది. నక్షత్రాలు మిలుకుమిలుకు మంటున్నా స్పష్టంగా కనబడడం లేదు. పున్నమి చంద్రుడు మాత్రం నవ్వులు రువ్వుతున్నాడు తెల్లతెరచాటున అందచందాలు చిందించు తన ఇరవై ఏడుమంది భామల్ని చూస్తూ!

నేను గుమ్మం దగ్గరికి వచ్చానోలేదో ఎదురొచ్చి చేయిపట్టుకొని ఏమండీ! ఇంత ఆలస్యమైందేమండీ! సాయంత్రం 5 గంటలకే వెళ్ళిన మీరు ఇంతవరకూ రాకపోతే ఎంత గాబరా పడ్డానో తెలుసా?... ఎపుడెళ్ళినా గంటలో తిరిగి వచ్చేసేవారు!... అంటూ మాట్లాడుతూనే ఇంట్లోకి తీసికెళ్ళింది.

ఆమెకళ్ళల్లోకి చూసాను. కొంచెం చమర్చి ఉన్నాయి. మా ప్రేమ అలాంటిది. నా శ్రీమతి ప్రేమ ముద్ద!

ఎందుకే అంత కంగారు? వెళ్ళినవాణ్ణి రానేంటి?

ప్రేమ ఎక్కువైతే అలాగే ఉంటుందిలే! అతి స్నేహఃపాపశంకీ – అన్నాను.

భోంచేసాక చెప్తాలే... ఆలస్యం ఎందుకైందో!... అంటూనే ముఖం, కాళ్ళూ చేతులు కడుక్కొని, శ్రీమతి అందించిన తువ్వాలుతో తుడుచుకొని, "హమ్మయ్య!"... అంటూనే వంటింట్లో చతికిలపడ్డాను.

నేను భోంచేస్తేకానీ నా శ్రీమతి తినదు. ఒక్కొక్కసారి నాకు వడ్డించాక తాను కూడా కూర్చుంటుంది. ఈ రోజు ఇద్దరం కలిసి కూర్చున్నాం! కొత్తిమీర, అల్లం, కాస్తంత జీలకర్ర కలిపి దంచేసిన గుత్తివంకాయకూర వడ్డించింది. కబుర్లు చెప్పుకుంటూనే భోజనం పూర్తిచేసాం! మేం భార్యాభర్తలమైనా, మంచి స్నేహితులం. ఆప్యాయతానురాగాలు రంగరించి పోసారు నా శ్రీమతికి.

ట్యూబ్‌లైట్లు తీసేసింది. ఒక్క డిమ్ బల్బు మాత్రం వెలుగుతోంది. మా ముఖాలు మాత్రం మాకు బాగానే కనబడుతున్నాయి.

నేను పట్టిమంచంపై నడుంవాల్చాను.

నా ప్రక్కలోకి వచ్చి కూర్చుంది నా శ్రీమతి.

ఏవండీ! ఈరోజు ఆలస్యంగా రావటానికి కారణం భోంచేసాక చెప్తానన్నారు చెప్పరూ?... అంది ప్రేమగా నాచేతిలో చెయ్యివేసి.

చెబుదామనే అనుకొంటున్నా... ఇపుడా? అంటావేమోనని ఊరుకొన్నా. అడిగావుగా... చెప్పకపోతే నీకు నిద్రపట్టదాయె! విను... అంటూ ప్రారంభించా...

సాయంత్రం 5 గంటలకే బయలుదేరానా...? పెద్ద చెఱువు గట్టంతా నాలుగుసార్లు ప్రదక్షిణం చేసి గంటలో వచ్చేద్దామనుకొన్నా...

డా॥ ఆకొండి విశ్వనాథం

ఇంతకీ వాకింగ్ చేశారా? లేదా?... అంది.

అంత తొందరైతే ఎలా? చెప్తున్నాగా! చెఱువు గట్టంతా కిటకిటలాడుతోంది. ఆడామగా అందరూ చకచకా నడిచేస్తున్నారు. ఇంట్లో వ్యాయామాలు తగ్గిపోయాయి కదా... పూర్వం పప్పు రుబ్బేవారు, దంచేవారు. నీళ్ళు తోడేవారు. ఒకటేమిటి అన్ని పనులూ చేసుకొనేవారు. అవన్నీ వ్యాయామాలే. ఇపుడు మిక్సీలు, వాషింగ్‌మిషన్లు, ఒకటేమిటి... శ్రమలేకుండా ఎన్నో సాధనాలు... నీళ్ళు కావాలంటే టేప్ కూడా త్రిప్పనవసరంలేదు - చెయ్యిపెడితే చాలు నీళ్ళు వస్తాయి, తీస్తే ఆగిపోతాయి. ఇన్ని సుఖాలు వచ్చాకే జాగింగ్‌లొచ్చాయి... అంటూంటే...


స్వామీ! అసలు విషయం చెప్పండి!... అన్నది శ్రీమతి.

ఆ! చెప్పేస్తున్నా! ఆ చెఱువు గట్టు మీద నడుస్తూంటే, ఆ చల్లని తేమగాలికి మనసులో ఉల్లాసం పరవళ్ళు తొక్కుతూంటే ఊహాలోకంలో విహరిస్తూనే ముందడుగు వేసాను. ఇంతలో చిన్ననాటి స్నేహితుడు పలకరించాడు. దాంతో ఈ లోకంలోకి వచ్చా! టైం చూస్తే 7 గంటలు కావస్తోంది... ఇంటి ముఖం పట్టాను...

తర్వాత ఏం జరిగిందండీ?...

ఇంటికి వచ్చేస్తున్నానా? మధ్యలో ఓ పెద్ద మేడ కనబడింది. ఆ మేడను రోజూ చూస్తూనే ఉన్నా... కానీ ఇవాళ దాని అందం పదింతలు పెరిగింది. కళకళలాడుతోంది. దాని అరుగుకే అందం వచ్చిందా వేళ?... అంటూంటే...

ఎందుకంత అందం వచ్చిందంటారు?... అన్నది ఆతృతతో నా శ్రీమతి.



ఆ విషయమే చెబుతున్నా... ఓ అందాల రమణి నృత్తం చేస్తోంది. తాలలయాశ్రయమైన ఆ నృత్తం నన్ను నిలబెట్టేసింది. మువ్వల సవ్వడి ముగ్ధుడిని చేసింది.

మీరు కళారాధకులు – పైగా మీరూ నేర్చుకొన్నారుగా! అందుకే చూసి వచ్చారు.


నిజం... కళయే దైవం! కళాతపస్వియే మోక్షానికి అర్హుడనినేనంటాను – అంటూంటే, నా కళాతృష్ణకు నా శ్రీమతి ఉప్పొంగిపోయింది.

శ్రీమతీ! నన్ను ఆ కళ కట్టేసింది. ఆ అమ్మాయి అందచందాలు వర్ణనాతీతం. ఒక్కమాటలో... అపరంజి బొమ్మ! బంగారంలా మెరిసిపోయే ఆమె విశాలనేత్రాలు కూడా లాస్యం ఆడుతున్నాయ్! ఐశ్వర్యారాయ్ నేత్రాలను మించిపోయాయ్. దివ్యభారతి రూపాన్ని మరపిస్తోంది. ఏ నాటిదో ఈ అనుబంధం... అనుకొన్నా!

వర్ణించింది చాలు... ఇక ఆపండి... అంటుందనుకొన్నారేమో? నా శ్రీమతి మాత్రం అలా అనలేదు.

“ఇంతకీ! ఆ అమ్మాయి మీ మనసు దోచిందన్నమాట” అన్నది.

అన్నమాట కాదు... ఉన్నమాటే! కనురెప్పలార్పకుండా ఆ అమ్మాయికేసే చూస్తూ కొంతసేపు నిలబడ్డా! మువ్వలసవ్వడి నన్ను నిలబడనివ్వలేదు. సూదంటురాయిలా లాగేసింది.



అసంకల్పితంగానే అడుగులు పడ్డాయి. ఆమె చెంత నిలబడ్డా!

నిలబడ్డారూ! నిలబడతారు!... అమ్మాయి మిమ్మల్ని చూసిందా?... ఆ! చూస్తుందిలెండి. మీ అందచందాలు అవీ చూసేగా నేను మీకు దక్కాను... ఆ పిచ్చిపిల్ల కూడా నాలాంటిదే కావచ్చు!... అంటూ తన భావాలను వ్యక్తం చేసిందనుకుంటున్నారా?... అలాంటిది కాదు నా శ్రీమతి. నవ్వుతూ నా చెంతకు జరిగి, ఆమె నాట్యం ఎలా ఉందండీ?... అన్నది.

నన్ను చూసి, చతుర్విధాభినయాలతో కూడిన నాట్యం చేసింది. ఎంత ప్రేమ చూపిందో మాటల్లో చెప్పలేను.

ఆ! చూపదూ... చూపుతుంది. మీరు విరగబడి చూసారా? ఆ చూసే ఉంటారు! చూడరూ?... అంటూ నన్ను దెప్పలేదు సరికదా, నృత్తం కూడా చేసి చూపిందా?... అన్నది నా శ్రీమతి.

ఆ! సరిగ్గా చెప్పావ్! భావాశ్రయమైన నృత్తం... ఆ అమ్మాయి చేస్తూంటే చూడడానికి ఈ రెండు కళ్ళూ చాలవు. ఆంగికాభినయం అద్భుతం!

రసాశ్రయమైన నాట్యం, భావాశ్రయమైన నృత్తం, తాలలయాశ్రయమైన నృత్తం – త్రివేణీ సంగమతీర్థంలా ఆ అమ్మాయి అందించింది. ఆనందం చిందించింది. సంతోషం స్పందించింది. అంతే... అరుగుపై చతికిలబడ్డాను, తన్మయంచెందాను.

మెల్లిమెల్లిగా తెరచిన నా కనురెప్పల సందుల్లోంచి ఆనందభాష్పాలు చిందులువేసాయి. నా ఎద తడిసింది. అది చూసి ఆ అమ్మాయి నవ్వింది. సొట్టబుగ్గ మొగ్గ తొడిగింది. అంతే... ఆమె నవ్వుల పువ్వులు నన్నభిషేకించాయ్!

ఇదంతా వింటూనే నా శ్రీమతి నా ఒళ్ళో తలవాల్చింది... ప్రేమ నవ్వుల పువ్వులు రువ్వుతూ.

ఒక్క క్షణం నేను ఆమెనే చూస్తూ ఉండిపోయాను.

ఆగిపోయారే? ఆ తర్వాత కథ నన్ను చెప్పమంటారా?... అన్నది శ్రీమతి.

ఊ! చెప్పు విందాం!... అన్నాను నిద్ర కళ్ళతో నవ్వుతూ!

ఆ అమ్మాయి మీ దగ్గరకు వచ్చింది... ముఖంలో ముఖం పెట్టి చూసింది. అంతే...

ఊ! ఆ తర్వాత ఏం జరిగిందో చెప్పాలి?...

ఆ! ఏం జరిగి ఉంటుందో చెప్పాలా? ఓ ముద్దు ఇచ్చి ఉంటుంది... అంది నవ్వుతూ!

నిజంగా చూసినట్లే చెప్పేశావ్! నువ్వు కనుక నవ్వుతూ చెప్పావ్... నన్ను బాగా అర్థం చేసుకొన్నావ్! మరొకరైతే పెట్టే బేడా సర్దుకొని పుట్టింటికి పోతామంటారు! ఏమైనా నా శ్రీమతికి సాటి నా శ్రీమతియే!... అంటూ పొండ్సు బుగ్గలు నిమిరాను.

ఇంతకీ తర్వాత ఏం జరిగిందో తెలుసా? ఆ అమ్మాయి ముద్దిచ్చి, నన్ను పట్టేసుకొని వదల్లేదు. ఆ ముద్దు చప్పుడు ఎంత పని చేసిందో తెలుసా?...

ఊహూ!... ఎలా తెలుస్తుంది చెప్పండి? ఇంతకీ మరో ముద్దు ఎవరైనా ఇచ్చారా ఏంటి?... అంది సందేహిస్తూ.

అబ్బా! మళ్ళీ నిజం చెప్పేశావ్!... ఆ ముద్దు చప్పుడు విని, చప్పున చక్కావచ్చింది యింట్లోంచి మరో అమ్మాయి. ఈ అమ్మాయి కన్నా కొంచెం పెద్దమ్మాయి. వస్తూనే ఖాళీగా ఉన్న రెండో బుగ్గ మీద ముద్దుపెట్టేసి, నన్ను పట్టేసు కొంది.

ఇలా రెండు బుగ్గల మీదా వాళ్ళిచ్చిన ముద్దులకి పూరీల్లాంటి నా రెండు బుగ్గలూ చపాతీల్లా అయిపోయాయి. చూడు... అంటూ చూపించా రెండు చెంపలూ.


అయ్యో పాపం! ఎలా చిక్కినాయో! అంటూ తన అరచేతితో నిమిరింది... నా శ్రీమతి నన్ను ఓదారుస్తూ.

ఇంతకీ తర్వాత ఘట్టం వినాల్సిందే... అంటూ మొదలుపెట్టాను.

ఇద్దరమ్మాయిలూ నన్ను పట్టేశారేమో, నేను ఉక్కిరిబిక్కిరైపోతున్నా. వారిచ్చిన ముద్దులకు మురిసిపోతున్నా!

ఇంతలో ఓ ముత్తైదువ లోపల్నుంచి వచ్చింది. ముద్దుల వర్షంలో తడిసిపోతున్న నా హర్షాన్ని చూసి నవ్వుకొంది. ఆమె ఆనందాన్ని చూసి నిర్ఘాంతపోయా! ఆమె వస్తూనే నా కాళ్ళకు నమస్కారం చేసింది. "దీర్ఘసుమంగళీభవ" - అన్నాను. మష్టారూ! మీ ప్రియశిష్యురాలిని. మిమ్మల్ని చూసి పదేళ్ళయింది. పెళ్ళిచేసికొని మీ యింటికి వచ్చి, మీ దీవెనలుపొందాం!... ఈ అమ్మాయిలిద్దరూ మా పాపలే! మా వారు డ్యాన్సు మాష్టారు. వీళ్ళకి బాగా నేర్పారు. ఏదో నాకు వచ్చిన సంగీతం నేర్పాను. అంతా మీరు పెట్టిన భిక్షయే. మీరెన్నో విద్యలు నేర్చుకొన్నారు. మీకు రాని విద్య లేదు. మీ గురించి మా పాపలకు చెప్తూంటాను. మీ ఫొటోలు చూపించాను. వారు మిమ్మల్ని గుర్తు పట్టేశారు... అని చెపుతూంటే నా కళ్ళు చెమ్మగిల్లాయి.

"తాతయ్యా!"... అని ఆ అమ్మాయిలిద్దరూ పిలుస్తూంటే, ఏ నాటిదో ఈ అనుబంధం... అనుకొన్నాను. రేపు తాతయ్య ఇంటికి తప్పక




రండి అని చెప్పి వచ్చాను.

శ్రీమతీ! మనలాంటి వృద్ధులకు ఇలాంటి ప్రేమానురాగాలే బ్రతుకుపై తీపినిస్తాయి. అప్యాయతలు లేని బ్రతుకులెందుకు? శిష్యులు కూడా సంతానమే. మనమలతో ఆడుకొనే మనలాంటి వారే అదృష్టవంతులు... ఆ అమ్మాయిపేరు లక్ష్మి. నీకు గుర్తుందా? అడిగాను.

ఆ పాప అమ్మా పిలుస్తోంటే ఎంతగానో పరవశించాను. నాకెందుకు గుర్తులేదండీ? బాగా గుర్తుంది మీ అనురాగం నాకు తెలియదా? అంది నవ్వుతూనే.

తల్లిదండ్రులే పిల్లలకు పెద్దలయందు ప్రేమానురాగాలు పెంచాలి. మమత, మానవత్వం నేర్పాలి. ఆ పిల్లల్ని చూసినపుడే, ఎక్కడో మారుమూల దాగియున్న తాతయ్య మేల్కొన్నాడు. పాపల నవ్వులే పరమాత్మ నవ్వులుగా నా మనసుకు తోచింది. వాళ్ళలోని ప్రేమ నిస్వార్థమైంది. స్వచ్ఛమైన ప్రేమైకానందసుఖమే మోక్షం.

మంచి మనసే మనిషిని మాధవునిగా మలుస్తుంది. మంచి చూపే మనసుని మనీషిగా మార్చి మురుస్తుంది. అపుడే ముక్తి వరిస్తుంది... ఇలా చెప్పుకుపోతూంటే...

✧ ✧ ✧

భళ్ళున తెల్లారింది. స్నానపానాలు పూర్తయ్యాయి.

శ్రీమతి ఫలహారపళ్ళెంతో నా ముందుకొచ్చింది. నేనా జరిగిన కథంతా వ్రాస్తున్నాను.

స్వామీ! పళ్ళు తినండి!... అంటూ జాం పండుముక్క నోట్లో పెట్టింది.

ఇంతలో గంతులేసుకుంటూ తల్లీ పిల్లలు చక్కావచ్చారు. వస్తూనే "అమ్మమ్మా!"... అంటూ ఆ ఇద్దరు పాపలూ చుట్టుముట్టేశారు. చలాకీ పాప అమ్మమ్మకిచ్చేసింది ఓ తియ్యటి ముద్దు. మరోపాప ఇచ్చింది నాకో కమ్మటి ముద్దు. ●